# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 7-9-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 30 పేజీలు:6 వెల: రూ.1/-


## బంగ్లాదేశ్ ఎగుమతులకు భారత్ అతిపెద్ద విపణి : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: ఆసియా వ్యాప్తంగా చూస్తే బంగ్లాదేశ్ ఎగుమతులకు భారత్ అతిపెద్ద విపణిగా ఉందని ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడించారు. భారత పర్యటనకు విచ్చేసిన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాల బలోపేతంపై సమీక్ష నిర్వహించారు. ఐటీ, అంతరిక్ష పరిశోధనలు, అణు శక్తి విభాగంలోనూ పరస్పర సహకారం కొనసాగించాలని నిర్ణయించామంటూ మోదీ, షేక్ హసీనా ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఆసియా ప్రాంతంలో భారత్ కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి బంగ్లాదేశ్ అని, అభివృద్ధిలోనూ భారత్ కు బంగ్లాదేశ్ అతిపెద్ద భాగస్వామి అని మోదీ వివరించారు. ఇది ఇరుదేశాల ప్రజల మధ్య సహకారానికి సంబంధించిన విషయం అని, ఇది నిరంతరం పురోగమిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ వాణిజ్య పురోగతిని మరింత ముందుకు తీసుకెళతామని, ద్వైపాక్షిక సమగ్ర ఆర్థిక ఒప్పందం కుదుర్చుకునేందుకు త్వరలోనే చర్చలు జరుపుతామని తెలిపారు. రానున్న రోజుల్లో భారత్–బంగ్లాదేశ్ మైత్రి మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## దేశవాళీ ఆవుల సంరక్షణకు సహకరించండి : అల్లోల దివ్యారెడ్డి




హైదరాబాద్, సెప్టెంబర్ 6: క్రాస్ బ్రీడింగ్ వల్ల దేశంలో అంతరించిపోయే దశకు చేరిన దేశవాళీ ఆవుల సంరక్షణకు చేస్తున్న ప్రయత్నాలకు మద్దతునివ్వాలని 'సేవ్ దేశీ కౌస్ క్యాంపెనర్' అల్లోల దివ్యారెడ్డి ఎంపీ సంతోష్ కుమార్‌ను కోరారు.

మంగళవారం ప్రగతి భవన్‌లో ఎంపీ సంతోష్ కుమార్‌ను కలిసి దేశవాళీ ఆవుల సంరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాలను ఆమె వివరించారు. హైబ్రిడ్ జాతులతో క్రాస్ బ్రీడింగ్ పద్ధతుల వల్ల దేశీయ పశుసంపద కనుమరుగైపోకుండా, వాటిని పరిరక్షించి, భవిష్యత్తు తరాలకు ఈ సంపాదనను అందించాలనే కర్తవ్యంతో సేవ్ దేశీ కౌస్ ప్రచారం చేపట్టినట్లు తెలిపారు.

పర్యావరణ అవగాహన, పచ్చదనం పెంపులో భాగంగా గ్రీన్ ఇండియా చాలెంజ్, సీడ్ గణేషా లాంటి ఎన్నో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, దేశవాళి ఆవుల, పాడి పరిశ్రమ అభివృద్ధికి కూడా చేయూతను అందించాలని సంతోష్ కుమార్ ను కోరారు.

సామాజిక బాధ్యతగా దేశవాళీ ఆవుల సంరక్షణ కోసం దివ్యా రెడ్డి చేస్తున్న కృషిని ఎంపీ సంతోష్ కుమార్ అభినందించారు. మంచి కార్యక్రమాలకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు.

## సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 6: సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్ ఏర్పాటుకు నానక్ రామ్‌గూడ వద్ద రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎంపీ రంజిత్ రెడ్డి, రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మొదటి దశలో 23 కిలోమీటర్ల మేర 4.5 మీటర్ల వెడల్పుతో సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్‌ను.. 16 మెగావాట్లతో విద్యుత్ ఉత్పత్తి చేసేలా ఏర్పాటు చేస్తారు. 2023 వేసవి నాటికి అందుబాటులోకి తేవాలని హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ లక్ష్యంగా పెట్టుకున్నది. నానక్ రామ్‌గూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు 8.50 కిలోమీటర్లు, నార్సింగి నుంచి కొల్లూరు 14.5 కిలోమీటర్ల వరకు సైకిల్ ట్రాక్ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. పర్యావరణానికి అనుకూలంగా ఉండే.. ప్రజాఉపయోగమైన నాన్ మోటరైజ్ ట్రాన్స్‌పోర్ట్ సెల్యూషన్స్‌ను ఉద్దేశంతో ట్రాక్‌ను శంకుస్థాపన చేశామన్నారు.

గత ఆరు నెలల కిందట ఓ మిత్రుడు సౌత్ కొరియాలో సైక్లింగ్ ట్రాక్ ఉందని, హైవే మధ్యలో సోలార్ ప్యానల్లతో కట్టారు.. చూడడానికి బాగుంది.. హైదరాబాద్‌లో, తెలంగాణలో ఏర్పాటు చేస్తే బాగుంటుంది. భారత్‌లో ఇప్పటి వరకు ఎవరూ చేయలేదు.. ఇక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందని' అని సూచించారు. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి అమలుచేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. దానికి అనుగుణంగా అధికారులను సౌత్ కొరియాకు వ్యక్తిగతం పంపామని, ఆ తర్వాత దుబాయిలో బాగుందంటే వెళ్లి అక్కడి మోడల్‌ను స్టడీ చేశారన్నారు. విస్తృతమైన పురోగతి, పట్టణీకరణ జరుగుతుందని, దానికి తగినట్లుగా స్థానికంగా ఉండే యువకులు, ఐటీ రంగాల్లో పనిచేసే వారందరికీ ఇంటి నుంచి ఆఫీస్‌కి, ఆఫీస్ నుంచి ఇంటికి అవసరమైతే బైసైక్లింగ్ చేస్తూ వెళ్లి వచ్చే పద్ధతి ఏర్పాటు చేస్తే బాగుంటుందని, కేవలం ఆఫీస్‌కి వెళ్లికి రాకుండా ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం సైతం బాగుంటుందన్నారు.

ప్రస్తుతం అందరికీ ఫిజికల్ ఫిట్‌నెస్‌పై ఆసక్తి పెరిగిందన్నారు. 24 గంటలు ఈ ట్రాక్ అందుబాటులో ఉంటుందని, అమ్మాయిలు, అబ్బాయిలు, పిల్లందరికీ ఉత్సాహపరిచేలా భారత్‌లో తొలిసారిగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. శంకుస్థాపన చేయడంతో పాటు మోడల్ డెమో కింద 50 మీటర్లు తయారు చేశామన్నారు. జర్మనీ, సౌత్ కొరియా, ఇతర దేశాలకు దీటుగా నాలుగున్నర మీటర్ల వైశాల్యంతో ప్రపంచ స్థాయి నిర్మించామన్నారు. భవిష్యత్ అంతర్జాతీయ సైక్లింగ్ టోర్నీ నిర్వహించేందుకు అనుకూలంగా ఉండేలా నిర్మిస్తున్నట్లు చెప్పారు.

## బౌద్ధ వారసత్వ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నాం : మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్, సెప్టెంబర్ 6: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న బౌద్ధ వారసత్వ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్, బుద్ధవనం ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్‌తో తైవాన్ దేశ ప్రతిష్టాత్మక మహాబోధి సొసైటీ ప్రతినిధులు శ్రమనెర, బిక్షుబుద్ధ దత్త, సాగటనందాలు ఇవాళ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

ఈ సమావేశం సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బుద్ధుడి తర్వాత మరో బుద్ధుడిగా పేరుగాంచిన ఆచార్య నాగార్జునుడు నడియాడిన ప్రదేశం, తొలి బౌద్ధ విశ్వవిద్యాలయ కేంద్రం.. కృష్ణా నది ఒడ్డున ఉన్న నాగార్జున సాగర్ వద్ద ఉన్న 274 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయిలో బౌద్ధ వారసత్వ కేంద్రాన్ని అభివృద్ధి చేశామన్నారు. బుద్ధవనం అభివృద్ధిలో భాగంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి దశల వారీగా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న బౌద్ధ వారసత్వ కేంద్రాల అభివృద్ధి, అంతర్జాతీయంగా ఉన్న పర్యాటకులను ఆకర్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ప్రచారం నిర్వహిస్తున్నామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

బుద్ధవనం ప్రాజెక్టులో ప్రసిద్ధ మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో బౌద్ధఆరామాలు, ధ్యాన మందిరాల నిర్మాణం, ఆధ్యాత్మిక విద్యాకేంద్రాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని తైవాన్ నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువులు మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు ప్రతిపాదనలు సమర్పించారు. ఈ ప్రతిపాదనపై మంత్రి శ్రీనివాస్ గౌడ్ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించాలని బుద్ధవనం ప్రాజెక్టు అధికారులను మంత్రి ఆదేశించారు.

## రాష్ట్రంలో 485 కొత్త సబ్ సెంటర్ల నిర్మాణం : మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్, సెప్టెంబర్ 6: రాష్ట్రంలో 485 కొత్త సబ్ సెంటర్ల నిర్మాణంతోపాటు, 206 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మరమ్మతులు చేపడుతామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

అలాగే 43 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కొత్త భవనాల నిర్మాణాలు చేపట్టడానికి రూ.203 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి.

వెంటనే ఆయా భవనాల నిర్మాణాలు, మరమ్మతులకు అవసరమైన టెండర్లు పూర్తి చేసి ఈ డిసెంబర్ కల్లా ఆయా పనులన్నీ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సీఎం కేసీఆర్ ఆదేశాలు, మంత్రి హరీశ్ రావు సూచన మేరకు నిర్ణీత సమయంలో ఆయా పనులు పూర్తి కావడం కోసమే ఈ పనులను పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

ఇందులో భాగంగా వైద్య వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ శ్వేతా మహంతి, ఇంజినీరింగ్ అధికారులతో మంత్రి ఎర్రబెల్లి మంగళవారం మంత్రుల నివాసంలోని తన ఇంటి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ..ఒక్కో కొత్త భవనానికి రూ.1.5 కోట్లు, ఒక్కో సబ్ సెంటర్ నిర్మాణానికి 20 లక్షల చొప్పున కేటాయించినట్లు మంత్రి తెలిపారు. అలాగే 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధుల్లో మిగిలిన నిధులను ఈ విధంగా వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. అయితే, ఆయా పనులను అనుకున్న సమయంలో చేపట్టి, పూర్తి చేయగలిగే కాంట్రాక్టర్లకు మాత్రమే అప్పగించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ నెల 9వ తేదీలోగా టెండర్లు పూర్తి చేసి, వచ్చే డిసెంబర్‌లోగా నిర్మాణాలు పూర్తి అయ్యేట్లు చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ కమిషనర్ హన్మంతరావు, పంచాయతీరాజ్ ఈఎన్‌సీ సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌కు శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 6: ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తన జన్మదిన సందర్భంగా సోమవారం అసెంబ్లీలో సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఫారూఖ్ హుస్సేన్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

ఫారూఖ్ హుస్సేన్ వంద సంవత్సరాలు ఆయురారోగ్యాలతో జీవించాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. అసెంబ్లీ లాబీల్లో మంత్రులు, టీఆర్ఎస్ఎమ్మెల్యేలు ఫారూఖ్ హుస్సేన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## వేములవాడ రూరల్ సర్కిల్ ఆఫీస్,రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 6: (నేటినిజం ప్రతినిధి): వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా పరిధిలోని వేములవాడ రూరల్ సర్కిల్ ఆఫీస్,రూరల్ పోలీస్ స్టేషన్ జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తనిఖీ చేశారు చేశారు. అనంతరం సర్కిల్ ఆఫీస్, పోలీసు స్టేషన్ల పరిసరాలను సందర్శించి పోలీసుస్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణపై పరిశీలిం చారు.విధుల్లో భాగంగా పోలీసులు మెయింటేన్ చేసే రిసెప్షన్, జీడీ ఎంట్రీ తదితర ప్రతీ రికార్డును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.పోలీస్ స్టేషన్లలో అమలు చేస్తున్న ఫంక్షనల్ వర్టికాల్స్ ,కోర్ట్ డ్యూటీ , రిసెప్షన్ ,బ్లూ కోల్ట్ / పెట్రోల్ మొబైల్ , క్రైమ్ టీమ్స్ , టెక్ టీమ్స్ పనితీరు పరిశీలించారు.అనంతరం ఎస్పీ శ్రీ మాట్లాడుతూపోలీసులు అంకితభావం, జవాబుదారితనంతో విధులను నిర్వర్తించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గస్తీ, పెట్రోలింగ్, విజుబుల్ పోలీసింగ్ లనుపెంచాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాత నేరస్తులు, సస్పెక్ట్ లు, రౌడీ షీటర్లపై నిఘాను ఉంచాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా చేపడు తుంటే సమాచారము అందించిన వెంటనే చర్యలు చేపడతామని, సైబర్ నేరాల విషయంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి అని తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారం ప్రాధాన్యతగా విధులుండా లని ఆదేశించారు.లా అండ్ ఆర్డర్, నేరాల నివారణ వ్యూహాలపై ఎస్పీ సిబ్బందితో చర్చించారు. స్టేషన్ లోని సిబ్బంది తో మాట్లాడి వారి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావలన్నారు. ఏదైనా నేరం జరిగినప్పుడు సరైన సమాచారాన్ని, ఆధునికతను ఉపయోగించి నేరస్తులను గుర్తించి వారికి కోర్ట్ ల ద్వారా శిక్ష పడేలా చేసి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలనన్నారు. వేములవాడ రూరల్ సర్కిల్ కార్యాలయం,రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ గారు అధికారులతో కలిసి మొక్కలు నాటారుఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ బన్సీలాల్,వెంకటేష్, ఎస్.ఐ నాగరాజు సిబ్బంది ఉన్నారు..

## ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 6: ఖైరతాబాద్ లో కొలువుదీరిన శ్రీ పంచముఖ మహాలక్ష్మి గణపతిని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొదటిసారి ఖైరతాబాద్ గణేష్ విగ్రహాన్ని మట్టితో తయారు చేసినందుకు ఉత్సవ సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.మట్టి, గోమయంతో గణపతిని చేయడం పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కూడా రాష్ట్ర వ్యాప్తంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసిందన్నారు.సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నిమజ్జనం కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని శాఖల సమన్వయం, ప్రజల సహకారంతో గణేష్ ఉత్సవాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వస్తున్నామని మంత్రి తెలిపారు.

## బీజేపీకి ఆస్తులను ప్రైవేట్ చేయడంలో ఉన్న శ్రద్ధ కార్మికుల సమస్యల పై లేదు.. తలసాని



హైదరాబాద్, సెప్టెంబర్ 6: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ పరం చేయడంలో ఉన్న శ్రద్ధ, చిత్తశుద్ధి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో లేదని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధ్వజమెత్తారు. మంగళవారం సికింద్రాబాద్ లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరుగుతున్న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ 30వ జాతీయ మహాసభల్లో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. అతిపెద్ద రవాణా వ్యవస్థగా రైల్వే శాఖకు ఎంతో గుర్తింపు ఉందన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో సైతం వేలాది గూడ్స్ రైళ్ళను నడిపి దేశంలోని వివిధ ప్రాంతాలకు సరుకులను సరఫర చేశారని, ప్రత్యేక రైళ్ళను నడిపి కార్మికులు తమ నిబద్ధతను చాటుకున్నారన్నారు. 1962 లో చైనా దురాక్రమణ సమయంలో, 1999 నాటి కార్గిల్ యుద్ధ సమయంలో సైతం రైల్వే కార్మికులు 24 గంటల పాటు పనిచేసి యుద్ధ ట్యాంక్ లను, ఇతర యుద్ధ సామాగ్రిని సైనికులకు అందించడం జరిగిందన్నారు.

ఈ క్రమంలో 3200 మంది రైల్వే కార్మికులు కరోనా భారినపడి మరణించారని, నేటి వరకు వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఒక్క పైసా ఎక్స్ గ్రేషియా చెల్లించక పోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఇండియన్ ఎయిర్ లైన్స్, ఇన్సురెన్స్ లను ప్రైవేట్ పరం చేయడమే కాకుండా రైల్వేను కూడా ప్రైవేట్ పరం చేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కార్మికులు ఆందోళన చెందవద్దని, దేశం మొత్తం మీ వెంటే ఉంటుందని స్పష్టం చేశారు. కార్మికులు తలచుకొంటే దేశంలో ఒక్క రైలు కూడా కదలదని, మీరేమిటో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చూపెట్టే సమయం దగ్గరలోనే ఉందన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాటం చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేతృత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని చెప్పారు. వ్యవసాయానికి, పరిశ్రమలకు 24 గంటలు విద్యుత్, ఇంటింటికి త్రాగునీటి సరఫరా వంటి అనేక కార్యక్రమాలు అమలు జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షులు గుమన్ సింగ్, జనరల్ సెక్రెటరి రాఘవయ్య, వెంకట సుబ్బమ్మ, ప్రభాకర్ ఆద్సు, భాను ప్రసాద్, శేఖర్ రాం, ఆడం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## లండన్ చేనేత బతుకమ్మ సంబురాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, సెప్టెంబర్ 6: లండన్ చేనేత బతుకమ్మ, దసరా సంబురాల పోస్టర్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్డమ్ ఆధ్వర్యంలో.. అక్టోబర్ 1న ఘనంగా చేనేత బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నారు.

ఈ వేడుకలకు ఎమ్మెల్సీ కవితను ప్రతినిధులు ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ చైర్మన్ అనిల్ కుర్మాచలం, టీఎస్ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

### చరిత్రలో నేటినిజం



[illegible]

(సెప్టెంబర్ 7 నటుడు మాముట్టి పుట్టిన రోజు...)

–రాధశ్రీ
సెల్:9494481210



# పుస్తకం హస్తభూషణం - అపూర్వ విజ్ఞాన ఖజానా

## ('జాతీయ పుస్తక పఠన దినం' సందర్భంగా)

పుస్తకం హస్తభూషణమే కాదు మస్తిష్క వికాసనం కూడా అని మనకు తెలుసు. పుస్తక పఠనం ఓ చక్కని అలవాటు. జ్ఞాన భాండాగారంగా పూజించబడే పుస్తకాలను సరస్వతి రూపాలుగా కొలుస్తాం. పుస్తకం విశ్వాన్ని పరిచయం చేస్తుంది, వింతలు విడ్డూరాలను విప్పి చూపుతుంది. పుస్తకం మానవాళి మేధోశక్తిని పోషిస్తుంది. పుస్తకం అక్షరాల కుప్ప కాదు, జ్ఞాన జ్యోతిని వెలిగించే ఇంధనం. పుస్తకం మనో నేస్తం, సమాజోద్ధరణకు ఊతం. ప్రపంచాన్ని పరిచయం చేస్తూ, నూతన ఆవిష్కరణాగ్నికి ఆజ్యం పోసేది పుస్తక పఠనమే. లోక రీతు, శాస్త్ర ప్రగతులు, సాంకేతిక జిలుగులు, అజ్ఞానాన్ని పారద్రోలే మహోజ్వల వెలుగులను నింపగల మహాశక్తివంతమైంది పుస్తకమే కదా. జ్ఞాన లోతులను పరిచయం చేస్తూ, ప్రపంచ సమస్యలకు సరైన సమాధానం ఇవ్వగల మోధో నిధి పుస్తకమే. పుస్తక ప్రాధాన్యతను గుర్తించి పుస్తక పఠనానికి జీవనశైలిలో సింహభాగం కేటాయించాడాన్ని ప్రోత్సహించే కృషిలో భాగంగా ప్రతి ఏట 06 సెప్టెంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా "జాతీయ పుస్తక పఠన దినోత్సవం" పాటించుట జరుగుతోంది.

గ్రంధాలయాల సందర్శన, వ్యక్తిగత గ్రంధాలయాన్ని నిర్మించుకోవడం, పుస్తక పఠన సంఘాలను ఏర్పాటు చేసుకోవడం, విలక్షణ పుస్తకాల సేకరణ చేసే అభిరుచిని కలిగి ఉండడం, స్నేహితులు పుస్తకాలను మార్చుతుంటూ చదువు కోవడం, పుస్తక పఠన ప్రాధాన్యతలను వివరించడం, పుస్తక పఠన పోటీల నిర్వహణ, పాఠశాలల్లో పుస్తక పఠనాన్ని ఆదరించడం, పుస్తకాన్ని జీవితకాల నేస్తంగా భద్రపరుచు కోవడం లాంటి అంశాలను జాతీయ పుస్తక పఠన దిన వేదికల్లో విద్యార్థుల ముందు చర్చించాలి. 1990లో హోవర్డ్ బెర్గ్ రికార్డు స్థాయిలో నిమిషానికి 25,000 పదాలు చదవడంతో అత్యంత వేగంగా చదివిన వ్యక్తిగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు దక్కించుకున్నారు. సాధారణ పాఠకులు నిమిషానికి 300 వరకు పదాలు చదువగలుగుతారు. అన్నీ జోన్స్ అనబడే పాఠకురాలు హారీ పోట్టర్ పుస్తకాన్ని నిమిషానికి 4,200 పదాల వేగంతో 47 నిమిషాల్లో చదివి ప్రపంచ పఠన బహుమతిని గెలుచుకున్నారు. మన పిల్లలు ఘన కార్యం చేసినపుడు ఓ మంచి పుస్తకాన్ని బహుమతిగా ఇవ్వడాన్న తల్లితండ్రులు పాటించాలి. పుస్తక పఠనాభిరుచితో మోధో వ్యాయామం జరిగి చురుకుగా తయారవుతారు. వాడవాడలా పుస్తక క్లబ్‌లు ఏర్పాటు చేయాలి.

పుస్తక పఠన ప్రయోజనాలు :

పుస్తకాలు అపూర్వ వినోద, విజ్ఞాన కోవెలలుగా భావించబడాలి. పుస్తకాన్ని పది మందికి అందుబాటులో ఉంచుట ద్వారా విజ్ఞాన వితరణకు దోహదపడిన వారమవుతాం. జ్ఞాపకశక్తిని పెంపొందించుట, ఏకాగ్రతను సాధించుట, మానసిక ఒత్తిడిని కలిగించుట, కాస యంత్రంగా పని చేయుట లాంటి ఇతర ప్రయోజనాలు పుస్తక పఠనంతో కలుగుతాయి. పుస్తక పఠనంతో జీవన సంక్లిష్టతలను అధిగమించడం, మేధావిగా రాణించడం, సృజనను పెంపొందించడం, జ్ఞాపకశక్తిని పెంచడం, అనుమానాలను/అజ్ఞానాన్ని తరిమేయడం, పదకోశాలను పెంచుకోవడం,జీవన లక్ష్యాలను అధిగమించడం, జీవనోపాధిని పొందడం, కుటుంబ సభ్యులను విద్యావంతులుగా మార్చడం, సహానుభూతిని పోషించడం, నిద్ర సమస్యలు తొలగడం, వినోద విందులు చేసుకోవడం, విద్యావంతుడిగా గుర్తింపు పొందడం, మెదడు చురుకుదనం పెరగడం, ప్రేరణ కలిగించడం, నైపుణ్యాలను పొందడం, పలు ప్రశ్నలకు సమాధానాలు లభించడం, మంచి స్నేహితులను పొందగలగడం లాంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

నేటి నానో, డిజిటల్ విప్లవయుగంలో పుస్తక పఠనాభిరుచి పలుచబడుతోంది. చదవడం మానేసి టివి/గూగుల్ సైట్స్ చూసే కల్చర్‌ను అలవర్చుకుంటున్నాం. బుక్ కల్చర్‌ను నిర్లక్ష్యం చేస్తూ లుక్ కల్చర్‌కు అలవాటు పడుతున్నాం. గూగులమ్మ కన్న పుస్తక సరస్వతే మిన్న అని విద్యార్థులకు వివరిద్దాం. జ్ఞాన సంపదను తరతరాలకు అందజేస్తున్న పుస్తకాలు మనకు అపూర్వ ఆస్తులుగా నిలవాలి. పుస్తకాన్ని నమ్మిన వారు పుణీతులైనారు. అక్షరాలు కొలువైన పుస్తకాలు సమాజ ప్రగతి రథాలుగా మారాలి. ప్రపంచ మానవాళిని అక్షరాస్యులుగా, విద్యావంతులుగా మార్చగలిగే నిశ్శబ్ద శక్తిరూపం పుస్తకమే అని గమనించి పుస్తక పఠనాన్ని మహాయజ్ఞంగా కొనసాగిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## భారత్‌ను సందర్శించే రవాణాయేతర మోటారు వాహనాల నిబంధనలు, 2022 నోటిఫికేషన్ జారీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ 02.09.2022 నాటి జిఎస్ఆర్ 680(ఇ) నోటిఫికేషన్‌ను అనుసరించి మోటార్ వెహికిల్స్ నాన్ ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్స్ విజిటింగ్ ఇండియా రూల్స్ (భారత్‌కు వచ్చే రవాణాయేతర మోటారు

వాహనాల నిబంధనలు),2022ను జారీ చేసింది. ఇతర దేశాలలో రిజిస్టర్ అయిన రవాణాయేతర (వ్యక్తిగత) వాహనాలు భారత దేశంలోకి ప్రవేశించేటప్పుడు లేదా దేశ భూభాగంలో చరిస్తున్న వాటి కదలికలను ఈ నిబంధనలు అధికారికం చేస్తాయి.

దేశంలో ఉన్న సమయంలో ఈ వాహనాలను నడుపుతున్నప్పుడు ఈ నిబంధనల కింద దిగువన పేర్కొన్న పత్రాలను వాహనంలో ఉంచుకోవాలి. అవి -

ఎ) చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్;

బి) చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్సు లేదా అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్, ఏది వర్తిస్తే అది

సి) చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ పాలసీ

డి) చెల్లుబాటు అయ్యే కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ (మూల దేశంలో వర్తిస్తే)

ఒకవేళ పైన పేర్కొన్న పత్రాలు ఇంగ్లీషు కాక వేరే భాషలో ఉంటే, దానిని జారీ చేసిన అధికార యంత్రాంగం వాటిని ధ్రువీకరించిన అధీకృత ఆంగ్ల అనువాదాన్ని అసలు పత్రాలతో పాటు ఉంచుకోవాలి.

భారత దేశంలో కాకుండా మరే ఇతర దేశంలో నమోదు చేసిన మోటారు వాహనాలను, భారత భూభా పరిధిలో స్థానిక ప్యాసింజర్లను, వస్తువులను రవాణా చేసేందుకు అనుమతించరు.

భారతదేశం కాకుండా ఇతర దేశాలలో నమోదు చేసిన మోటారు వాహనాలు భారత మోటారు వాహనాల చట్టం, 1988 కింద రూపొందించిన నియమాలు నిబంధనలకు లోబడి, అందుకు అనుగుణంగా ఉండాలి.

## పేయు పేమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఇండియాఐడియాస్.కామ్ లిమిటెడ్ (ఐఐఎల్) 100% ఈక్విటీ షేర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: కాంపిటేషన్ యాక్ట్ , 2002లోని సెక్షన్ 31(1) ప్రకారం పేయు పేమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (పేయు ఇండియా) ద్వారా ఇండియాఐడియాస్.కామ్ లిమిటెడ్ (ఐఐఎల్) 100% ఈక్విటీ షేర్ క్యాపిటల్‌ను పొందడాన్ని కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదించింది.

ప్రతిపాదిత కలయిక ఐఐఎల్ 100% ఈక్విటీ షేర్ క్యాపిటల్‌ను పేయు ఇండియా కొనుగోలు చేయడానికి సంబంధించినది.

పేయు భారతదేశం ప్రధానంగా చెల్లింపు అగ్రిగేషన్ సేవలను అందిస్తుంది, ఇది వ్యాపారులు (మరియు ఇతర సంస్థలు) వివిధ డిజిటల్ చెల్లింపు పద్ధతులలో వారి కస్టమర్ల నుండి చెల్లింపులను స్వీకరించడానికి వీలు కల్పిస్తుంది.

పేయు ఇండియా షేర్లు పరోక్షంగా ప్రొసస్ ఎన్.వి ("ప్రొసస్") వద్ద ఉన్నాయి. ప్రోసస్ అనేది గ్లోబల్ కన్స్యూమర్ ఇంటర్నెట్ గ్రూప్. ప్రపంచంలోని ప్రముఖ సాంకేతిక పెట్టుబడిదారులలో ఒకటి. ప్రోసస్ యూరోనెక్స్ట్ ఆమ్‌స్టర్‌డామ్‌లో ప్రాథమిక జాబితాను కలిగి ఉంది.

నాస్పర్స్ లిమిటెడ్ ప్రోసస్‌లో 73.6% ఓటింగ్ హక్కులను కలిగి ఉంది. నాస్పర్స్ జోహన్నెస్‌బర్గ్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ అయింది.

ఐఐఎల్ ఒక అన్‌లిస్టెడ్ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ. ఇది భారతదేశంలో "బిల్‌డెస్క్" అనే పేరును దాని వర్తకం/వ్యాపారం/ బ్రాండ్ పేరుగా ఉపయోగిస్తుంది.

ఐఐఎల్ ప్రాథమికంగా చెల్లింపు సముదాయ సేవలను అందిస్తుంది, ఇది వ్యాపారులు (మరియు ఇతర సంస్థలు) వివిధ డిజిటల్ చెల్లింపు పద్ధతులలో వారి కస్టమర్ల నుండి




## జిల్లా కేంద్రంలో ఘనంగా గురుపూజోత్సవం ..!

**-80 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం.**
**-సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం.**
**- జిల్లా జడ్పీ చైర్ పర్సన్ మంజు శ్రీ జైపాల్ రెడ్డి.**

సంగారెడ్డి, సెప్టెంబర్ 06 (నేటి నిజం ప్రతినిధి) సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, రాష్ట్ర అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని జిల్లా జడ్పీ చైర్ పర్సన్ మంజు శ్రీ జైపాల్ రెడ్డి కోరారు.




ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధాన ఉత్సవం కార్యక్రమంలో జిల్లా జడ్పీ చైర్పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

కార్యక్రమంలో ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంజుశ్రీ మాట్లాడుతూ అజ్ఞానమనే చీకటిని తొలగించి విజ్ఞానం వైపు నడిపించేది గురువులన్నారు. దేశ భవిష్యత్తుకు, మంచి సమాజ స్థాపనకు విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్ది అందించాలన్నారు.

పాఠ్య పుస్తకాలనే కాక, లోకజ్ఞానాన్ని, సంస్కారాన్ని నేర్పి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనన్నారు. ప్రతి విద్యార్థిని ఉన్నతంగా తీర్చిదిద్దే గురువులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు.

విద్యాబుద్ధులు నేర్చుకున్న ప్రతి ఒక్కరు తమకు విద్య దానం చేసిన గురువులను గౌరవించుకునే దినం గురుపూజోత్సవ దినం అని అన్నారు. తమ ఉన్నత స్థితికి కారకులైన గురువులను ఉపాధ్యాయ దినోత్సవం నాడు సన్మానించి, పూజించి, స్మరించుకోవాలన్నారు.

సమాజంలో ఏ వ్యక్తి అయినా గొప్ప స్థితిలో ఉన్నారంటే గురువులు పెట్టిన భిక్ష అని చెప్పాలన్నారు. తనకు చదువు చెప్పిన గురువులను ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తుచేసుకొని శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు.

క్రమశిక్షణ కలిగిన చదువు ఉన్నతంగా ఎదిగేలా సహకరిస్తుంద న్నారు. సమాజంలో అందరి ముందు ఉన్నతంగా నిలబెట్టేది గురువులు చెప్పిన విద్యేనన్నారు. గురువు గొప్పతనం చెప్పాల్సిన అవసరం లేదని, ఆ గురువు చెప్పిన విద్యాబుద్ధులతో విద్యార్థులు మంచి పౌరులుగా ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. విజ్ఞానాన్ని, వికాసాన్ని, సంస్కారాన్ని నేర్పడంలో గురువు పాత్ర అమోఘమైనదని కొనియాడారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు అన్ని వసతులతో విద్యను అందించాలని మన ఊరు మనబడి కార్యక్రమం చేపట్టిందన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమం కింద జిల్లాకు రూ. 242 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు పిల్లలకు మంచి విద్యాబోధన చేసి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంచాలని ఆయన కోరారు.

సంగారెడ్డి మాజీ శాసనసభ్యులు చింతా ప్రభాకర్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో గురువుల అంకుటిత దీక్ష ఎనలేని దన్నారు.

విద్యార్థులు గురువులు చెప్పినట్లుగా చదువుకున్నట్లయితే తర్వాత వారి జీవితం గొప్పగా ఉంటుందన్నారు . ఉపాధ్యాయులు విద్యార్థుల మనోభావాలను గుర్తించి వారికి అనుకూలంగా మారి బోధన చేస్తూ, దేశానికి ఉన్నత పౌరులను అందిస్తున్న గురువుల గొప్పతనం ఎంత చెప్పినా సరిపోదని కొనియాడారు. రాధాకృష్ణ న్ ఆశయాలకు అనుగుణంగా, వారి బాటలో నడవాలని కోరారు.

అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ గురువు స్థానం ఎప్పుడూ ప్రతి ఒక్కరి గుండెల్లోనే ఉంటుందన్నారు. చిన్నతనంలో చేతులు పట్టుకుని అక్షరాలు దిద్దించి ఉన్నత పౌరులుగా తీర్చి దిద్దిన గురువుల నిస్వార్థ సేవకు ఏమిచ్చినా రుణం తీరదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా మారి విద్యార్థులను సానబట్టి వజ్రంలా తయారు చేస్తున్నారన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలుగు తీసుకువచ్చి, వారి ఆసక్తి మేరకు ప్రోత్సహించాలన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని, సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయుల కృషి కీలకమన్నారు.

జిల్లా గ్రంధాలయ చైర్మన్ నరహరి రెడ్డి మాట్లాడుతూ రైతు మొదలుకొని దేశ సైనికుల వరకు అన్ని రకాల పౌరులను తయారు చేస్తు, ఉన్నత సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నది ఉపాధ్యాయులేనని, వారిని మించిన దేశభక్తులు లేరన్నారు.

జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్తుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులు సమర్థవంతంగా పని చేయాలని కోరారు. విద్యను అందించే విద్యాలయాలను పటిష్టపరిచి బలోపేతానికి కృషి చేయడంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు .జిల్లాలో ఉత్తమ సేవలందించిన 80 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు జడ్పీ చైర్ పర్సన్, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మేమొంటో, శాలువాతో సత్కరించారు.

కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మాజీ శాసనసభ్యులు చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ నరహరి రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, విద్యాధికారి నాంపల్లి రాజేష్, ఎంఈఓ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ అవార్డు గ్రహీతలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లో రెండు రోజుల పాటు గనుల మంత్రుల జాతీయ సదస్సు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: దేశంలో ఖనిజ అన్వేషణను మరింత ప్రోత్సహించడానికి, మైనింగ్ రంగంలో కేంద్రం ఇటీవల తీసుకువచ్చిన విధాన సంస్కరణల ప్రభావాన్ని అంచనా వేయడానికి నూతన, సమర్థవంతమైన వ్యూహాలను రూపొందించడానికి బొగ్గు మంత్రిత్వ శాఖ, గనుల మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 9, 10 తేదీల్లో హైదరాబాద్ లో రెండు రోజుల పాటు గనుల మంత్రుల జాతీయ సదస్సును నిర్వహించనున్నాయి.

కేంద్ర బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి, గనులు, బొగ్గు, రైల్వే శాఖ సహాయ మంత్రి శ్రీ రావుసాహెబ్ పాటిల్ దాన్వే, బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, వివిధ రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు (గనులు), డిజిఎంలు/ డిఎమ్ జిలతో పాటు ఇతర సీనియర్ అధికారులు ఈ కీలకమైన సదస్సుకు హాజరుకానున్నారు. రాబోయే 25 సంవత్సరాలలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఖనిజాలకు ఉన్న డిమాండ్ ప్రస్తుత ఉత్పత్తిని మించిన విషయం దృష్ట్యా, మన మొత్తం పురోగతిలో ఖనిజ రంగం కీలకమైన పాత్రను పోషిస్తుంది. అందువల్ల, ఖనిజ రంగంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న అడ్డంకులను ముందుకు తీసుకురావడానికి జాతీయ గనుల మంత్రుల సదస్సు ఒక సమర్థవంతమైన వేదిక అవుతుంది. గనుల మంత్రిత్వ శాఖ, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడమే ఈ సదస్సు లక్ష్యం.

మైనింగ్ రంగంలో చేసిన కృషి, రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ (ఎన్ఎంఈటీ) నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్,, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలు సమర్పించిన ప్రజెంటేషన్‌లపై చర్చలు, రాష్ట్ర ప్రభుత్వాలు వేలం వేసే స్థితి, నోటిఫైడ్ ప్రైవేట్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీలతో (ఎన్పీఈఏ) సంప్రదింపులు వంటి అంశాలపై ఈ సదస్సులో ముఖ్యంగా చర్చలు జరగనున్నాయి.సదస్సు రెండో రోజున బొగ్గు రంగంలోని సంస్కరణలు, వాటి ప్రభావం, బొగ్గు గనుల ప్రాజెక్టులు, బొగ్గు లాజిస్టిక్స్ కోసం భూసేకరణకు సంబంధించిన విధానాలను వివిధ ప్రజంటేషన్ల ద్వారా బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రదర్శించనుంది. ఇప్పటికే కేటాయించిన బొగ్గు గనుల నిర్వహణ, వాటి స్థితిగతులపై దృష్టి సారించనుంది.రాష్ట్ర ప్రభుత్వాల గనుల శాఖ మంత్రులతో పాటు, బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్ జైన్, కోల్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ శ్రీ ప్రమోద్ అగర్వాల్ రెండో రోజు సదస్సులో ప్రసంగించనున్నారు.

## కాకినాడ సెంట్రల్ స్కూల్‌లో విద్యార్థులకు అస్వస్థత.. దవాఖానలో 30 మంది చేరిక

అమరావతి, సెప్టెంబర్ 6: వలసపాకల కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. తరగతి గదుల్లో ఊపిరాడక చిన్నారులు కళ్లు తిరిగి పడిపోయారు. వీరిని సమీపంలోని ఓ ప్రైవేట్?దవాఖానకు తరలించారు. ప్రస్తుతం వీరంతా క్షేమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. అస్వస్థతకు గల కారణాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న కలెక్టర్ పరిస్థితిని సమీక్షించారు. చిన్నారులకు తగిన వైద్యం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

కాకినాడ రూరల్ పరిధిలో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం ఉదయం ఒక్కసారిగా కలకలం రేగింది. స్కూల్‌కు వచ్చి ప్రార్థన తర్వాత తరగతి గదిలోకి వెళ్లగానే ఊపిరాడక కళ్లు తిరిగి కిందపడిపోయారు. విషయం తెల్సుకున్న తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు వారిని వలసపాకలలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. క్లాసులోకి వెళ్లగానే కళ్లు మంటలు లేచినట్లు అనిపించిందని, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండి పడిపోయినట్లు పిల్లలు చెప్తున్నారు. నిన్న రాత్రి కేకు తినడం వల్ల అస్వస్థతకు గురైనట్లు మరికొందరు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ కారణాలు మాత్రం తెలియరాలేదు. ఉపాధ్యాయులు దగ్గరుండి మరీ విద్యార్థులకు చికిత్స అందజేస్తున్నారు. తల్లిదండ్రులు వలసపాకలకు వచ్చి తమ చిన్నారుల కోసం ఆరా తీసి వారు క్షేమంగా ఉండటంతో ఊపిరిపీల్చుకున్నారు. అస్వస్థతకు గురైన చిన్నారులు అందరూ 6 వ తరగతికి చెందిన వారే కావడం విశేషం.

అస్వస్థతకు గురైన చిన్నారులు అంతా క్షేమంగానే ఉన్నారని అధికారులు తెలిపారు. పరిస్థితిని దగ్గరుండి సమీక్షించాలని విద్యాశాఖ అధికారులను ఏపీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. దాంతో అధికారులు వలసపాకలోని దవాఖానకు వచ్చి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించేలా చేశారు. విద్యార్థులంతా క్షేమంగా ఉన్నారని, సాయంత్రానికల్లా వారిని ఇళ్లకు పంపించివేస్తామని అధికారులు చెప్తున్నారు.

## బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట.. మాడవీధుల్లో వాహన సేవలు

తిరుమల, సెప్టెంబర్ 6: తిరుమలలో రెండేళ్ళ తరువాత శ్రీవారి బ్రహ్మోత్సవ వాహన సేవలను మాడవీధుల్లో నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. కరోనా కారణంగా గతంలో రెండు బ్రహ్మోత్సవాలు శ్రీవారి ఆలయంలో ఏకాంతంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉండడంతో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ సర్వదర్శనం మాత్రమే అమలు చేయాలని టీటీడీ నిర్ణయించింది. దీంతో అన్ని రకాల ప్రవిలేడ్జ్ దర్శనాలను రద్దు చేసింది. బ్రహ్మోత్సవాల రోజుల్లో ఎక్కువ మంది భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విఐపి బ్రేక్ దర్శనాలు, వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనం తదితర ప్రవిలేడ్జ్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఆర్జిత సేవలు రూ. 300 దర్శన టికెట్లతో పాటు శ్రీవాణిట్రస్టు దాతలకు, ఇతర ట్రస్టు దాతలకు దర్శన టికెట్లను రద్దు చేసింది. అలాగే స్వయంగా వచ్చే ప్రోటోకాల్ విఐపిలకు మాత్రమే బ్రేక్ దర్శనం.

ఇక గదులకు సంబంధించి 50 శాతం ఆన్‌లైన్‌లో భక్తులు బుక్ చేసుకునేందుకు వీలుగా అందుబాటులో ఉంచారు. మిగిలిన గదులను ఆఫ్‌లైన్‌లో తిరుమలోని వివిధ కౌంటర్ల ద్వారా భక్తులకు కేటాయిస్తారు. అక్టోబర్ 1 న గరుడ సేవ కారణంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రస్టుల దాతలకు, కాటేజి దాతలకు ఈనెల 30 నుంచి అక్టోబర్ 2 వ తేది వరకు ఆన్‌లైన్‌లో గదుల కేటాయింపు ఉండదు. భక్తులు ఈ విషయాన్ని గమనించాల్సిందిగా టిటిడి కోరింది. అదేవిధంగా పవిత్రంగా భావించే పెరటాసి మాసంలో బ్రహ్మోత్సవాలు రానుండడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు వచ్చే అవకాశం ఉందని, తిరుమలో గదుల లభ్యత పరిమితంగా ఉన్న కారణంగా ఈ విషయాన్ని గమనించి భక్తులు తిరుపతిలో గదులు పొంది బస చేయాలని టిటిడి విజ్ఞప్తి చేస్తుంది.

## వైద్యం వికటించి బాలుడు మృతి.. ఆస్పత్రి వద్ద కుటుంబీకుల ఆందోళన..



వరంగల్, సెప్టెంబర్ 6: వరంగల్ జిల్లా చెన్నరావు పేట మండలం లింగ్య తండకు చెందిన బుక్య విహన్ (8) కుడి చేయి విరిగిందని బాలుడిని ఎంజీఎం ఆసుపత్రి తీసుకొచ్చారు. మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి వస్తే అనిస్తిషియ డాక్టర్ డోస్ ఎక్కువ ఇవ్వడంతో వైద్య వికటించి బాలుడు మృతి చెందాడు. దీంతో చిన్నారి బంధువులు ఎంజీఎం అస్పత్రికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆందోళనకు దిగడంతో పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. దీంతో ఆస్పత్రి వద్ద టెన్షన్ వాతావరణం నెలకొంది.




# ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ పురస్కార విజేతలతో ప్రధానమంత్రి సంభాషణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: ఉపాధ్యాయ దినోత్సవం నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో జాతీయ ఉపాధ్యాయ పురస్కార విజేతలతో సంభాషించారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ– ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళి అర్పించారు. ఉపాధ్యాయురాలు కావడమేగాక ఒడిసా రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో విద్యా బోధన చేసిన ప్రస్తుత భారత రాష్ట్రపతి చేతులమీదుగా సత్కారం పొందడం ఎంతో విశిష్ట అంశమని ఆయన ఉపాధ్యాయులకు గుర్తుచేశారు. "ఇవాళ దేశం బృహత్తరమైన స్వాతంత్ర్య అమృత మహోత్సవ స్వప్నాన్ని నెరవేర్చుకోవడం ప్రారంభించిన నేపథ్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగంలో చేసిన కృషి మనందరికీ స్ఫూర్తిదాయకం. ఈ సందర్భంగా జాతీయ అవార్డు పొందిన ఉపాధ్యాయులందరినీ నేను అభినందిస్తున్నాను" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

ఉపాధ్యాయుల విజ్ఞానం, అంకిత భావం గురించి ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. విద్యార్థులు ముందంజ వేసేదిశగా వారితో కలసి అవిశ్రాంతంగా పనిచేయగల సానుకూల దృక్పథమే వారి విశిష్ట లక్షణమని పేర్కొన్నారు. "ఒక వ్యక్తికి వెలుగుబాట చూపడం ఉపాధ్యాయుని కర్తవ్యం.. అలాగే విద్యార్థుల కలలకు రూపమిచ్చి వాటిని సంకల్పంగా మార్చుకోవడం నేర్పేదీ వారే" అని ఆయన పేర్కొన్నారు. నేటి విద్యార్థులపైనే 2047 నాటి భారతదేశ స్థాయి, భవిష్యత్తు ఆధారపడి ఉన్నాయని ఆయన అన్నారు. తదనుగుణంగా విద్యార్థుల భవిష్యత్తును నేటి ఉపాధ్యాయులు రూపొందిస్తున్నారని చెప్పారు. "ఆ విధంగా మీరు విద్యార్థుల జీవితాలను ఉజ్వలం చేయడంతోపాటు దేశ భవితకు ఒక రూపాన్నివ్వడంలో మీ వంతు పాత్రను సమర్థంగా పోషిస్తున్నారు" అని ప్రధానమంత్రి కొనియాడారు. విద్యార్థి కలలతో ఉపాధ్యాయుడికి అనుబంధం ఏర్పడినప్పుడు, వారినుంచి గౌరవాదరణలు పొందడంలో విజయవంతం కాగలడని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

వివిధ అంశాలకు సంబంధించి విద్యార్థుల జీవితంలోని సంఘర్షణలు –వైరుధ్యాలను తొలగించాల్సిన ప్రాముఖ్యం గురించి కూడా ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు.

పాఠశాలలో, సమాజంలో, ఇంట్లో విద్యార్థి అనుభవంలోకి వచ్చే అంశాల నడుమ ఎలాంటి సంఘర్షణకూ తావుండరా దన్నది అత్యంత ప్రధానాంశమని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, విద్యారంగ భాగస్వాములు విద్యార్థుల కుటుంబాలతో మమేకమయ్యే విధానం అవసరమని ప్రధాని నొక్కిచెప్పారు. ప్రతి విద్యార్థినీ సమానంగా చూడాలని, కొందరిపై ఇష్టం.. మరికొందరిపై అయిష్టం చూపరాదని హితవు పలికారు.

జాతీయ విద్యా విధానంపై ప్రశంసలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ– ఇది సరైన దిశలో వేసిన ముందడుగని ప్రధాని వ్యాఖ్యానించారు. ఒకటికి నాలుగు సార్లు జాతీయ విద్యా విధానాన్ని లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. భగవద్గీతను పదేపదే చదివిన మహాత్మాగాంధీ ప్రతిసారి ఓ కొత్త భాష్యాన్ని కనుగొన్నారని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వ పత్రం విద్యార్థుల జీవితాలకు ప్రాతిపదిక కాగలిగేలా జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. "ఈ విధానాన్ని రూపొందించడంలో ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషించారు" అని ఆయన వెల్లడించారు. అందుకే జాతీయ విద్యా విధానం అమలులో వారి పాత్ర ఎంతో కీలకమని ప్రకటించారు.

స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో తానిచ్చిన సందేశంలో భాగంగా 'పంచ్‌ప్రాణ్' పేరిట చేసిన ప్రకటనను ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ 'పంచ ప్రాణాల' గురించి పాఠశాలల్లో క్రమం తప్పకుండా చర్చించవచ్చని, తద్వారా వాటి స్ఫూర్తిని విద్యార్థులకు స్పష్టంగా తెలపాలని సూచించారు. ఈ సంకల్పాలు దేశ ప్రగతికి ఒక మార్గంగా ప్రశంసించబడుతున్నాయని పేర్కొన్నారు. ఆ మేరకు వాటిని పిల్లలకు, విద్యార్థులకు తెలియజేసేందుకు మనం ఒక మార్గం అన్వేషించాల్సి ఉందని ఆయన అన్నారు. "దేశంలో ఏ మూలనైనా 2047 గురించి కలలు కనని విద్యార్థి ఉండరాదు" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. దండి యాత్ర, క్విట్ ఇండియా ఉద్యమాల మధ్య కాలంలో దేశాన్ని ఉర్రూతలూగించిన స్ఫూర్తిని పునరుజ్జీవింప చేయాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు.

యునైటెడ్ కింగ్‌డమ్‌ను అధిగమించి ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం ద్వారా భారతదేశం సాధించిన విజయాన్ని ప్రస్తావిస్తూ– సుమారు 250 ఏళ్లు మనమీద పెత్తనం చలాయించిన వారిని వెనక్కునెట్టడంలోని ఆనందం ఇప్పుడు ప్రస్ఫుటం అవుతోందన్నారు. గణాంకాల పరంగా 6వ స్థానం నుంచి 5వ స్థానంలోకి దూసుకెళ్లడాన్ని మించిన ఈ వాస్తవం మనకు ఎనలేని సంతోషాన్నిస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా భారతదేశం కొత్త శిఖరాలను అధిరోహించడానికి దోహదం చేసిన త్రివర్ణ స్ఫూర్తిని ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. "ఈ స్ఫూర్తి ఇవాళ చాలా అవసరం" అని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కోసం 1930 నుంచి 1942 వరకూ ప్రతి భారతీయుడూ బ్రిటిష్ పాలకులతో పోరాడిన సమయంలో దేశం కోసం జీవించి, శ్రమించి, ఆత్మత్యాగం చేసిన స్ఫూర్తి ప్రతి ఒక్కరిలోనూ రగలాలని పిలుపునిచ్చారు. "నా దేశం వెనుకబడిపోవడాన్ని నేనెంత మాత్రం సహించను" అంటూ ప్రతినబూనాలని సూచించారు. ''వేల ఏళ్లుగా కొనసాగిన దాస్య శృంఖలాలను మనం ఛేదించాం. మనం ఇక్కడితో ఆగేది లేదు? ముమ్ముందుకు సాగడమే మన కర్తవ్యం'' అని పునరుద్ఘాటించారు. భారత భవిష్యత్ చరిత్రలో ఉపాధ్యాయులు ఇలాంటి స్ఫూర్తిని నిండుగా నింపాలని, తద్వారా జాతి బలం బహుళం కాగలదని స్పష్టం చేస్తూ ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ ప్రధాన్, సహాయ మంత్రి శ్రీమతి అన్నపూర్ణాదేవి కూడా పాల్గొన్నారు.

నేపథ్యం

కర్తవ్య నిబద్ధత, విశిష్ట కృషితో పాఠశాల విద్య నాణ్యతను మెరుగుపరచడమేగాక విద్యార్థుల జీవితాలను సుసంపన్నం చేసిన అత్యుత్తమ ఉధ్యాయులను సగౌరవంగా సత్కరించడమే ఈ జాతీయ అవార్డుల ప్రధానోద్దేశం. దేశవ్యాప్తంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రతిభావంతులైన ఉపాధ్యాయులకు ప్రజల్లోగల గుర్తింపును ఈ జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రతిబింబిస్తాయి. ఈ సంవత్సరం పురస్కారాలకు పటిష్ట, పారదర్శక ఆన్‌లైన్ ప్రక్రియను మూడు దశలలో నిర్వహించి 45 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు.

# పిఎం-శ్రీ యోజనను ప్రకటించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎం–శ్రీ) యోజన కింద దేశవ్యాప్తంగా 14,500 పాఠశాలల స్థాయి పెంపు, అభివృద్ధి చేపట్టనున్నట్టు ప్రకటించారు.

పిఎం–శ్రీ పాఠశాలలు విద్యాబోధనలో ఆధునిక, పరివర్తిత, సంపూర్ణ విద్యావిధానం అనుసరిస్తాయి. ఎన్ఇపి స్ఫూర్తితో పిఎం–శ్రీ పాఠశాలలు దేశవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రయోజనం అందించడం ఖాయమని శ్రీ మోదీ అన్నారు.

ఆయన ఈ మేరకు ట్వీట్ చేశారు.

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎం–శ్రీ) యోజన కింద దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని 14,500 పాఠశాలల స్థాయి పెంపు, అభివృద్ధి చేసే కార్యక్రమం ప్రకటిస్తున్నందుకు నేను ఆనందిస్తున్నాను. ఎన్ఇపి సంపూర్ణ స్ఫూర్తితో పని చేస్తూ ఇవి మోడల్ పాఠశాలలుగా మారతాయి". "పిఎం–శ్రీ పాఠశాలలు విద్యాబోధనలో ఆధునిక, పరివర్తిత, సమగ్ర నమూనా అనుసరిస్తాయి. ఒకపక్కన అభ్యాసం చేస్తూనే మరో పక్క అన్వేషణాత్మకమైన బోధనకు ఇవి ప్రాధాన్యం ఇస్తాయి. ఆధునిక టెక్నాలజీ, స్మార్ట్ క్లాస్ రూమ్ లు, క్రీడా వసతులు ఎన్నో ఇందులో ఉంటాయి".

"ఇటీవల సంవత్సరాల్లో నూతన విద్యా విధానం విద్యా రంగాన్ని పరివర్తితం చేసింది. పిఎం–శ్రీ పాఠశాలలు ఎన్ఇపి స్ఫూర్తితో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుస్తాయన్న విషయంలో సందేహం లేదు".

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎం–శ్రీ) యోజన కింద దేశవ్యాప్తంగా 14,500 పాఠశాలల స్థాయి పెంపు, అభివృద్ధి చేపట్టనున్నట్టు ప్రకటించారు.

పిఎం–శ్రీ పాఠశాలలు విద్యాబోధనలో ఆధునిక, పరివర్తిత, సంపూర్ణ విద్యావిధానం అనుసరిస్తాయి. ఎన్ఇపి స్ఫూర్తితో పిఎం–శ్రీ పాఠశాలలు దేశవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రయోజనం అందించడం ఖాయమని శ్రీ మోదీ అన్నారు.

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎం–శ్రీ) యోజన కింద దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని 14,500 పాఠశాలల స్థాయి పెంపు, అభివృద్ధి చేసే కార్యక్రమం ప్రకటిస్తున్నందుకు నేను ఆనందిస్తున్నాను. ఎన్ఇపి సంపూర్ణ స్ఫూర్తితో పని చేస్తూ ఇవి మోడల్ పాఠశాలలుగా మారతాయి". "పిఎం–శ్రీ పాఠశాలలు విద్యాబోధనలో ఆధునిక, పరివర్తిత, సమగ్ర నమూనా అనుసరిస్తాయి. ఒకపక్కన అభ్యాసం చేస్తూనే మరో పక్క అన్వేషణాత్మకమైన బోధనకు ఇవి ప్రాధాన్యం ఇస్తాయి. ఆధునిక టెక్నాలజీ, స్మార్ట్ క్లాస్ రూమ్ లు, క్రీడా వసతులు ఎన్నో ఇందులో ఉంటాయి".

"ఇటీవల సంవత్సరాల్లో నూతన విద్యా విధానం విద్యా రంగాన్ని పరివర్తితం చేసింది. పిఎం–శ్రీ పాఠశాలలు ఎన్ఇపి స్ఫూర్తితో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుస్తాయన్న విషయంలో సందేహం లేదు".

# భావితరానికి పునాదులు వేసేది ఉపాధ్యాయులే



కామారెడ్డి, సెప్టెంబర్ 6: (నేటినిజం ప్రతినిధి): భవితరాలకు మేధావులను అందించడం ఉపాధ్యాయుల ద్వారానే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కామారెడ్డి కలెక్టరేట్లో మంగళవారం 50 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసేది ఉపాధ్యాయులేనని చెప్పారు. సమాజ ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని తెలిపారు. విద్యార్థుల్లో ప్రేరణ కల్పించవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. మన ఊరు– మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. జెడ్పి చైర్ పర్సన్ శోభ మాట్లాడారు. విద్యార్థులు సరైన మార్గంలో నడిచే విధంగా బోధన అందించడం ఉపాధ్యాయుల కర్తవ్యం అన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించినప్పుడు ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేసిన వారు అవుతారని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయులు తమ మేధాశక్తిని, విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు



కలెక్టర్ వెంకటేష్ దోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, అధికారులు లింగం, గంగా కిషన్, వేణు శర్మ, ఉమారాణి, సిద్ధిరాంరెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శాంతియుతంగా నిమజ్జనం జరుపుకోవాలి.. డీజేలకు అనుమతి లేదన్న పోలీసులు

కరీంనగర్ , సెప్టెంబర్ 6: గణశ్ నిమజ్జన ఉత్సవాలను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పెద్దపల్లి సీఐ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పద్దపల్లి పోలీస్‌స్టేషన్లో మండప నిర్వాహకులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో సీఐ మాట్లాడుతూ వినాయక నిమజ్జన సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా వేడుకలు జరుపుకోవాలన్నారు.

ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని, ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవన్నారు. శాంతియుత వాతావరణంలో వేడుకలు జరిగేలా ప్రజలంతా సహకరించాలని కోరారు.

నిమజ్జనం జరిగే ఎల్లమ్మ చెరువుతోపాటు ఇతర ప్రాంతాలలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. నిమజ్జనం జరిగే ఎల్లమ్మ చెరువులోకి ఎవరు దిగకుండా ఉత్సవ సమితి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాజేశ్‌తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆ భయంతోనే సిసోడియా నివాసంపై దాడుల విషయంలో వెనక్కితగ్గిన ఈడీ : ఆప్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందనే భయంతోనే ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా నివాసంపై దాడులను ఈడీ ఉపసంహరించుకుందని ఆప్ ఎమ్మెల్యే సౌరవ్ భరద్వాజ్ పేర్కొన్నారు. ఈడీ నుంచి వచ్చిన సూచనలకు అనుగుణంగా సిసోడియా నివాసం వద్దకు మీడియా ప్రతినిధులు చేరుకున్నారని ఆయన చెప్పారు. ఆపై మనీష్ సిసోడియా నివాసంపై దాడుల ఆలోచనను ఈడీ విరమించుకుందని అన్నారు.

గతంలో సీబీఐ దాడుల తరహాలోనే తాము కూడా సిసోడియా ఇంటిపై దాడుల అనంతరం ఒట్టి చేతులతో వెనుదిరగాల్సి వస్తుందని ఈడీకి అర్థమైందని చెప్పారు. సిసోడియా నివాసంపై దాడుల విషయంలో దేశం ముందు నవ్వులపాలవుతామని ఈడీ గుర్తెరిగిందని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లో రూ 2,500 కోట్ల భారీ పోషకాహార కుంభకోణం బయటపడితే అక్కడ ఈడీ–సీబీఐ కేసులు ఏమైనా నమోదు చేశాయా అని ఆప్ ఎమ్మెల్యే ప్రశ్నించారు.

మధ్య నిషేధం అమలవుతున్న గుజరాత్‌లో పట్టపగలే మద్యం ప్రవహిస్తుంటే సీబీఐ ఎలాంటి దాడులైనా చేపట్టిందా అని సౌరవ్ భరద్వాజ్ నిలదీశారు. ప్రధాని మోదీ అవినీతిపై పోరాడటం లేదని, సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై పోరాడుతున్నారని ఆరోపించారు. ఢిల్లీ మోడల్‌ను భగ్నం చేసేందుకు మోదీ అన్ని చర్యలూ చేపడుతున్నారని అన్నారు. కేంద్రం వత్తిడి చేయడంతోనే సీబీఐ వద్ద పనిచేసే డిప్యూటీ లీగల్ అడ్వైజర్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు.

# భారీగా ఎర్రచందనం పట్టివేత



అమరావతి, సెప్టెంబర్ 6: శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో రూ.కోట్ల విలువ చేసిన ఎర్రచందనం దుంగలను టెక్కలి పోలీసులు పట్టుకున్నారు. సీఐ సూర్య చందమౌళి, ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మాటుకాసి నౌపడ మెలియాపుట్టి రహదారి వద్ద పశువులు మేత, తవుడు మాటున ఈ రూ.కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా పట్టుకున్నారు. పోలీసులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం వీటివిలువ కోట్ల రూపాయలు ఉంటుంది అని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి టెక్కలి పోలీసు స్టేషన్ కు తరలించారు.

# తెలంగాణకు ఎల్లో అలెర్ట్.. మరో నాలుగు రోజులపాటు భారీ వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 6: మధ్యాహ్నం వరకు చెమటలు కక్కేలా కొట్టిన ఎండలతో ఉన్నట్టుండి హైదరాబాద్? సిటీలో వాతావరణం మారిపోయింది. సాయంత్రం 3 గంటల నుంచి చినుకులతో మొదలై.. ఆ తర్వాత భారీ వర్షం కురిసింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం కురిసిన భారీ వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో రోడ్లపై పెద్ద ఎత్తున నీరు నిలిచింది. పలు ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. ఇక.. బంజారాహిల్స్, ఖైరతాబాద్ జంక్షన్, రాజ్‌భవన్ రోడ్ తదితర ఏరియాలైతే ట్రాఫిక్? జామ్తో అతలాకుతలమయ్యాయి. రోడ్ నంబర్ 12 వద్ద ట్రాఫిక్ జామ్‌లను నివారించడానికి హైదరాబాద్ పోలీసులు నిలిచిన నీటిని క్లియర్ చేయడానికి ప్రయత్నించారు. ఇక హైదరాబాద్‌లోని మల్లా రెడ్డి ప్రాంతంలోని సూరారం ప్రధాన రహదారిపై కూడ పెద్ద ఎత్తన వాహనాలు నిలిచిపోయాయి.

# బ్యాంక్ వివాదాలు పరిష్కరించుకునేందు చక్కని అవకాశం

## –ఈ నెల 17న బ్యాంకర్స్ తో మెగా లోక్ అదాలత్

## –జిల్లా జడ్జి టి. శ్రీనివాసరావు

ఖమ్మం, సెప్టెంబర్ 6: (నేటినిజం ప్రతినిధి): బ్యాంక్ లావాదేవీలకు సంబందించిన వివాదాలు పరిష్కరించేందుకు ఈ నెల 17న మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా జడ్జి టి. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ మెగా లోక్ అదాలత్‌లో వివిధ రకాల బ్యాంక్ లు వివాదాలు పరిష్కరించుకునేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. మొత్తం 2231 ప్రీలిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు. వీటితో పాటు మరో 200 పెండింగ్ కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. ఈ మెగాలోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు మంచి ఉపయోగం ఉంటుందని, బ్యాంక్ లు ఈ సందర్భంగా మూల ధనంలోనే తగ్గింపు ఇచ్చి వివాదాలను పరిష్కరించుకునేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. వన్ టైం సెటిల్‌మెంట్ చేసుకోదలుచుకున్న కక్షిదారులకు మరిన్ని ప్రయోజనాలు ఒనగూరే అవకాశాలున్నాయన్నారు. ఈ మెగా లోక్ అదాలత్‌లో జిల్లా కోర్టుతో బాటు ఏడీజే, సబ్‌కోర్టులు కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు పాల్గొని వివాదాలను పరిష్కరించేందుకు పనిచేస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకొని, వివాదాలను పరిష్కరించుకోవలసిందిగా జిల్లా జడ్జి టీ. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జితో బాటు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్ పాషాలు పాల్గొన్నారు.





మంగళవారం దీపాకళా ఫ్రెండ్స్ అసోసియేషన్, జవహర్‌నగర్, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ వారి45వ గణపతి మహోత్సవాల సందర్భంగా గణపతి కళాషాభిషేకం 108 కలశములతో భక్తుల చేతి మీదుగా అమర్‌నాధ నుండి సింధూనది, శబరిమల పంచానది, శ్రీశైలం కృష్ణానది,మానస సరోవరం జలములతో అభిషేకం చేయబడినది. మరియు గణపతి సహస్రనామం లక్ష్మీ కుంకుమార్చన పసుపుబొట్టు వితరన అన్నదానం కార్యక్రమము జరిగినది. ఈకార్యక్రమమునకు ముఖ్య అతిథిగా స్థానిక శాసన సభ్యులు శ్రీ ముఠాగోపాల్‌గారు, మరియు శ్రీ ముఠాగోపాల్‌గారి సతీమణి సరోజదేవిగారు, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మనరేష్‌గారు. పాల్గొన్నారని సంస్థ అధ్యక్షుడు ఎస్.టి. అశోక్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమములో ఎస్.టి. ప్రేమ్, ఎస్. రాణిక్రిష్ణ, ఎస్.టి. రమేశ్, ఎస్. వెంకటేశ్, ఎస్. ప్రణయ్ రాజ్, హేమంత్, సాయి హరీష్, రఘు, రాజు, రాణి కార్తీక్, వసంత్ పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన స్పెషలాఫీసర్ ఖుర్షీద్



మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మండల ప్రత్యేక అధికారి కుర్షిద్ ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. వారు వంటగది ,స్టోర్ రూమ్, క్లాస్ రూమ్ ,ఆహారపు మెనూ, మిషన్ భగీరథ వాటర్ కనెక్షన్ గురించి ఆరా తీయడం జరిగింది. వారికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీఓ జగదీశ్వర్ గౌడ్ ,పంచాయతీ కార్యదర్శి వెంకన్న, పాఠశాల ప్రత్యేక అధికారిని స్రవంతి ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సోమవారానికి వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 6: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల మరణించిన మాజీ శాసనసభ్యులకు సభ సంతాపం ప్రకటించింది. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. 'సూర్యాపేటలోని తుంగతుర్తి నియోజకవర్గ మాజీ సభ్యురాలు మల్లు స్వరాజ్యం మృతిపట్ల సభ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నది. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నది. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం 1978–1983, 1983–84 వరకు తుంగతుర్తి ఎమ్మెల్యేగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. 1945 నుంచి 48 వరకు జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. సాయుధ పోరాటంలో మొట్టమొదట తుపాకీ పట్టిన మహిళ మల్లు స్వరాజ్యం. 1981 –2002

వరకు ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘంలో చురుగ్గా పాల్గొని, సంఘానికి అధ్యక్షురాలుగా పనిచేశారు.

1993లో అప్పటి ఏపీలో జరిగిన సంపూర్ణ మద్యపాన నిషేధ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. ఆమె నియోజకవర్గ ఎనలేని కృషిచేశారని, 2022 మార్చి 19న 90 సంవత్సరాల వయసులో మరణించారు' అన్నారు. కరీంనగర్ జిల్లాలోని కమలాపూర్ నియోజకవర్గం మాజీ సభ్యుడు పరిపాటి జనార్దన్‌రెడ్డి మృతి పట్ల సభ తీవ్ర సంతాపం తెలుపుతున్నది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతున్నది. జనార్ధన్‌రెడ్డి 1972–78, 1978–1983 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. 1959–71 వరకు హుజూరాబాద్ సమితి అధ్యక్షుడిగా పని చేశారు. జమ్మికుంటలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడ్డారు.

లెప్రా సొసైటీలో సభ్యుడైన ఆయన.. 1968 హిందూ కుష్ఠ నివారణ సమితిని స్థాపించి.. వ్యాధిగ్రస్తులకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. 1974 సంవత్సరంలో గ్రామ నవ నిర్మాణ సమితి అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి రంగంలో ప్రజలకు సేవలందించారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 6: (నేటినిజం ప్రతినిధి): స్థానిక అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 5 న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాదులోని రవీంద్ర భారతిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, యువజన క్రీడల సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మరియు కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నవీన్ మిట్టల్ చేతుల మీదుగా అవార్డును ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల నుండి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు కైవసం చేసుకున్నందుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. శ్రీనివాస్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు ఆయనని శాలువా పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

### 26 సంవత్సరాల సుదీర్ఘ విద్యా రంగ సేవలు

డాక్టర్ తిరుక్కోవెల శ్రీనివాస్ ప్రస్తుతం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ గా సేవలు అందిస్తున్నారు. జగిత్యాల జిల్లా లచ్చక్క పేట గ్రామానికి చెందిన ఆయన 1996 సంవత్సరంలో స్కూల్ అసిస్టెంట్ గా బోధనావృత్తిలోకి అడుగుపెట్టారు. నాలుగున్నర సంవత్సరాలు టీచర్ గా, తొమ్మిదిన్నర సంవత్సరాలు జూనియర్ లెక్చరర్ గా, 12 సంవత్సరాలుగా డిగ్రీ లెక్చరర్ గా విద్యారంగంలో సేవలందిస్తున్నారు. అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకి మూడు సంవత్సరాలు ఎఫ్ఎసి ప్రిన్సిపాల్ గా పనిచేశారు. ఈ కాలంలో కళాశాలకి జాతీయ స్థాయి ఎన్ ఏ



ఏసీ 'బి' గ్రేడ్ గుర్తింపు, అంతర్జాతీయ స్థాయి ఐఎస్ఓ 9001 గుర్తింపు, కళాశాలలో పీజీ కోర్సుల మంజూరు మరియు కళాశాలలో ప్రవేశాల సంఖ్యని 120 నుండి 420 వరకు పెంచ టడంలో కృషి చేశారు. 50 అంతర్జాతీయ జాతీయ స్థాయి సదస్సులలో పాల్గొని పేపర్ ప్రజెంటేషన్ చేశారు. జాతీయ అంతర్జాతీయ జర్నల్స్ లో 14 పరిశోధన పత్రాలు సమర్పించారు. మూడు ఈ బుక్స్ ని ప్రచురించారు.

శాతవాహన యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగానికి బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్ గా పాఠ్యాంశాల కూర్పు మరియు ప్రశ్నపత్రాల రూపకల్పన లో ఆయన తన సేవలను అందిస్తున్నారు. ఈయన సేవలకు గుర్తింపుగా స్వాతంత్ర దినోత్సవం మరియు రిపబ్లిక్ డే ఉత్సవాలలో జిల్లా కలెక్టర్ నుండి ఉత్తమ ప్రిన్సిపాల్ గా 2019, 2020 లో ప్రశంస పత్రాలను అందుకున్నారు. 2021లో బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డును కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్నందుకు చాలా ఆనందంగా ఉందని, దీంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని ఆయన సంతోషం వెలిబుచ్చారు.

## విఘ్నేశ్వర స్వామివారికి దర్శించుకున్న డిఎస్పీ నాగేంద్ర చారి

**-అన్నదానం మహాదానం**

**-నిమజ్జన ఊరేగింపులో కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి**

**-గ్రామ ప్రజల,దాతల సహకారంతో అన్నదానం విజయవంతం**



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 6: (నేటినిజం ప్రతినిధి): దీవెనలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని,అన్ని ధానాల్లో అన్నదానం మహాదానమని డిఎస్పీ నాగేంద్రచారి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లి గ్రామంలో శ్రీ దుబ్బ రాజరాజేశ్వర స్వామి దేవ స్థానంలో ఏర్పాటు చేసిన వినాయక స్వామివారిని డిఎస్పీ నాగేంద్రచారి దర్శించుకొని, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా డిఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ గ్రామ ప్రజలపై వినాయక స్వామి దీవెనలు వుండి, ఆయురారోగ్యాలతో సుఖసంతో షాలతో బాగుండాలని అన్నారు. గ్రామంలో పురాతన అలయమైన, ఎంతో విశిష్టత ఉందని అన్నారు. ఆలయంలో ఉన్న విగ్రహాలు కొన్ని ఆలయాల్లోనే చూసానన్నారు. వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలని సూచించారు. భక్తి శ్రద్ధలతోఊరేగింపు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,మహిళలు,తదితరులు పాల్గొన్నారు..






## ప్రపంచవ్యాప్తంగా ఉన్న చార్టర్డ్ అకౌంటెంట్లను బ్రాండ్ ఇండియా అంబాసిడర్‌లుగా ఉండాలి- శ్రీ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజాపంపిణీ, జౌళి శాఖల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈరోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న చార్టర్డ్ అకౌంటెంట్లను బ్రాండ్ ఇండియాకు అంబాసిడర్‌లుగా ఉండాలని కోరారు. అమెరికాలోని 6 ప్రాంతాల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ)ని ప్రారంభించిన అనంతరం శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు.

ఐసీఏఐ ఆఫీస్ బేరర్‌లు తమ వృత్తిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చేస్తున్న కృషికి మంత్రి అభినందనలు తెలిపారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా శ్రీ గోయల్ తన శుభాకాంక్షలను తెలియజేస్తూ.. రాబోయే 25 సంవత్సరాలు భారతదేశం ఒక శక్తిగా ఎదగడానికి మరియు భౌగోళిక రాజకీయ రంగంలో ఒక ముఖ్యమైన స్థానాన్ని సాధించడానికి చాలా కీలకమైన సమయం అని తెలిపారు. భారతదేశం చేస్తున్న ఈ ప్రయాణంలో ఐసిఏఐ కూడా కీలక పాత్ర పోషిస్తుందని, ఐసిఏఐ వంద అంతర్జాతీయ కార్యాలయాలను కలిగి ఉండే సమయం కోసం తాను ఎదురు చూస్తున్నానని అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న చార్టర్డ్ అకౌంటెంట్లు ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నారని నొక్కిచెప్పిన మంత్రి.. చార్టర్డ్ అకౌంటెంట్ ప్రొఫెషనల్స్ సమగ్రతకు సంరక్షకులని అన్నారు. సీఏ సిగ్నేచర్ గురించి శ్రీ గోయల్ ప్రస్తావిస్తూ చిత్తశుద్ధి మరియు నిజాయితీకి గుర్తుగా ఈ సంతకం విలువ సీఏల పనిని మరింత గంభీరంగా మరియు సీరియస్ గా మార్చిందని అన్నారు. 118 సంవత్సరాలలో తొలిసారిగా 2022 నవంబర్‌లో ముంబైలో జరగనున్న 21వ వరల్డ్ అకౌంటెంట్స్ కాంగ్రెస్‌ను ప్రస్తావిస్తూ.. భారతదేశం జీ20 అధ్యక్ష పదవిలో ఉన్నప్పుడు ఇది జరగాలని నిర్ణయించుకున్నట్లు శ్రీ గోయల్ చెప్పారు. దేశాల మధ్య భారతదేశానికి పెరుగుతున్న ఔచిత్యానికి ఇది గుర్తింపు అని ఆయన అన్నారు.

కల్లోల ప్రపంచంలో భారతదేశం సుస్థిర ద్వీపమని తెలిపిన మంత్రి, నేడు వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారతదేశం ఒకటని అన్నారు. ద్రవ్యోల్బణంపై భారతదేశ దృష్టిని నొక్కిచెప్పిన శ్రీ గోయల్..2014 నుండి, ద్రవ్యోల్బణం ఆర్బీఐ ప్రాథమిక దృష్టి అని ప్రభుత్వం నిర్ధారిస్తుంది మరియు 2014 నుండి, భారతదేశం సగటున 4.5% ద్రవ్యోల్బణాన్ని చూసింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇది మనం ఏ 8 సంవత్సరాలలో చూసినా కనిష్ట స్థాయి అని తెలిపారు.

నేడు ప్రపంచంలో అనిశ్చిత ద్రవ్యోల్బణం దృష్ట్యా భారతదేశం అత్యంత అనుకూలమైన పెట్టుబడి గమ్యస్థానాలలో ఒకటి మరియు నేడు ప్రపంచానికి ప్రాధాన్యత కలిగిన భాగస్వామి అని మంత్రి అన్నారు. ద్వైపాక్షిక ఒప్పందాల ద్వారా భారత్‌తో తమ భాగస్వామ్యాన్ని మరియు వాణిజ్యాన్ని విస్తరించడానికి ప్రపంచ నాయకులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. మనం ఆస్ట్రేలియా మరియు యుఎఇతో రెండు విజయవంతమైన ఎఫ్‌టిఎలను కలిగి ఉన్నాము మరియు యుకెతో చర్చలు చివరి దశలో ఉన్నాయి. అది బహుశా దీపావళి నాటికి ముగుస్తుందని తెలిపారు.

సులభతర వ్యాపారాన్ని మెరుగుపరచడానికి జీఎస్టీ,ఐబీసీ, డీక్రిమినలైజేషన్ మరియు సమ్మతి తగ్గింపు, భారతదేశానికి వచ్చే కొత్త వ్యాపారాలపై తక్కువ కార్పొరేట్ పన్ను, డివిడెండ్ పంపిణీ పన్నులు మరియు జాతీయ సింగిల్ విండో వంటి మార్పులను మార్చే ఆర్థిక సంస్కరణల గురించి మంత్రి మాట్లాడారు. వ్యాపారం మరియు ఆర్థిక కార్యకలాపాలను విస్తరించేందుకు భారతదేశంలో నూతన ఉత్సాహాన్ని తీసుకువచ్చిందన్నారు

ఐసిఏఈ మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆ సంస్థ సభ్యులకు శ్రీ గోయల్ నాలుగు చర్యలకు పిలుపునిచ్చారు:తమ అంతర్జాతీయ ఖాతాదారులకు భారతదేశంలో అందుబాటులో ఉన్న అద్భుతమైన పెట్టుబడి అవకాశాలను అందించాలని ఆయన వారిని కోరారు.ఐసిఏఐలోని ప్రతి సభ్యులను బ్రాండ్ ఇండియాకు అంబాసిడర్‌లుగా ఉండాలని మరియు భారతదేశం అందించే పోటీ ధరలకు అధిక నాణ్యత గల ఉత్పత్తుల సందేశాన్ని వ్యాప్తి చేయడంలో సహాయపడాలని ఆయన కోరారు. భారతదేశం ఎగుమతులను బాగా విస్తరించింది. మనం ఒక శక్తివంతమైన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఓడిఓపి) చొరవను కలిగి ఉన్నాము మరియు ఆత్మనిర్భర్త మన వృద్ధి తత్వశాస్త్రంలో ప్రధానమైనది అని ఆయన అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐసిఏఐ సభ్యులను వీలైనప్పుడల్లా, ముఖ్యంగా బహుమతి కోసం మేడ్–ఇన్–ఇండియా ఉత్పత్తులను ఉపయోగించాలని మంత్రి కోరారు. సబ్కా ప్రార్థన అనే నినాదం ప్రపంచంలోని ప్రతి భారతీయుడికి వర్తిస్తుందని ఆయన నొక్కి చెప్పారు.శ్రీ గోయల్ భారతదేశంలోని చార్టర్డ్ అకౌంటెన్సీ సంస్థలను ప్రపంచ భాగస్వామ్యాలను అభివృద్ధి చేసి అంతర్జాతీయ స్థాయి సంస్థలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మన పూర్వీకులు వదిలిపెట్టిన విశ్వాసం, నిజాయితీ మరియు ఉన్నత ప్రమాణాల వారసత్వం, ప్రపంచం మనపై ఉంచిన నమ్మకానికి న్యాయం చేయడానికి ఎల్లప్పుడూ మనకు స్ఫూర్తినిస్తుందని మంత్రి అన్నారు.

## వృద్ధులకు అండగా ఆర్మీ అధికారి...



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 6: (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం నర్సింగపూర్ గ్రామ గ్రామానికి చెందిన ఆర్మీ అధికారి పేరుక రాజు నిరుపేద వృద్ధులకు అండగా నిలిచారు. తాను విధులు నిర్వహించే తిరువనంతపురంలో వృద్ధులకు దుస్తులు. పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెరుక రాజు మాట్లాడుతూ కనిపించని దేవుళ్ళ కోసం ఎక్కడికో వెళ్లి పూజలు ఇస్తామని. కనిపించే అసలు దేవతలు వృద్ధులని కొనియాడారు. వృద్ధులకు సేవచేయడానికి మించిన పూజ పుణ్యం వేరెక్కడ దొరకదని అన్నారు. మైగిఫ్ట్ యువ స్వచ్ఛంద సంస్థ తరపున ఆదివారం తిరువనంతపురంలోని వృద్ధాశ్రమ వృద్ధులకు ప్రముఖ సాహితీ వేత్త, అనువాదకుడు, కవి మై గిఫ్ట్ రూపశిల్పి ఆర్మీ అధికారి డా. పెరుక రాజు పండ్లు పంచి వస్త్రాలు బహూకరించాడు. మానవ దృక్పధంతో సేవ చేయడం మంచిదని ఉన్న ఊరు కన్న తల్లితో సమానమని యువకులు మానవత్వ సత్యంతో ఇలాంటి కార్యక్రమాలు పేరు కోసం కాకుండా ప్రేమ తత్త్వంతో చేయాలన్నారు. మంచి నడవడి భూతాదయ ఆలోచనలతో ముందుకు సాగుతూ చెట్టులా సేవచేసే తత్త్వం అలవర్చుకొని జీవితాన్ని సార్థకం చేసుకోవాలని పిలుపునిచ్చారు,

## రామగుండం కళాకారులకు నిలయం : కోరుకంటి చందర్..

కరీంనగర్ , సెప్టెంబర్ 6: రామగుండం పారిశ్రామిక ప్రాంతం కళలకు కళాకారులకు నిలయమని ఈ ప్రాంతంలో కళాభవనం అవసరమని త్వరగతిన కళాభవనం పనులను చేపట్టాలని రామగుండం శాసన సభలో కోరుకంటి చందర్ జాతీయ రహదారుల భవనాలు, తెలంగాణ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ గణపతి రెడ్డిని కోరారు.

మంగళవారం హైదరాబాద్ లో కలిసి 2017 సంవత్సరంలో 4 కోట్లతో కళాభవనం నిర్మాణం కోసం టెండర్ జరిగిందని, సదరు కాంట్రాక్టు మృతిచెందటంతో కళాభవనం నిర్మాణ పనులు నిచిపోయాయన్నారు. కళాభవనం నిర్మాణం కోసం రివైజ్ ఎస్ట్ మెషన్ వెసి టెండర్ ప్రకియ పూర్తి చేసి కళభవనం పనులు త్వరగా ప్రారంభించాలన్నారు.



Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com